క్లుప్తంగా

పీఏసీఎస్‌ల్లో రైతులకు రబీ రుణాలివ్వాలి

ప్రత్తిపాడు: పెదనందిపాడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని రైతులకు రబీ సీజన్‌లో పంట రుణాలు వెంటనే ఇవ్వాలని సుభిక్ష సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కొల్లా సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పెదనందిపాడు ప్రాంతంలో రబీ సీజన్‌లో వేల మంది రైతులు వాణిజ్య పంటలైన మిర్చి, పొగాకును సాగు చేశారని, వేలల్లో పెట్టుబడులు అవుతున్నాయని చెప్పారు. రుణాల కోసం రైతులు సొసైటీలకు వెళ్తే, రుణాల మంజూరు అధికారం స్పెషల్ ఆఫీసర్‌కు మాత్రమే ఉందని చెబుతున్నారని, ప్రత్యేకాధికారి గడిచిన ఏడు నెలలుగా అందుబాటులో లేరని పేర్కొన్నారు. దీని వలన రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఖరీఫ్‌లో కూడా రైతాంగం రుణాలు పొందలేక పోయారని తెలిపారు. సమస్యపై ఇప్పటికే సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు కూడా వినతిపత్రం అందించామని, సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుని రుణాలు మంజూరు చేయాలని కొల్లా కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామం అన్నపూర్ణనగర్‌లోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు కనుల పండువగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కొనసాగాయి. కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ధ్వజారోహణ, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించటం జరిగిందన్నారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తి ఊరేగింపు గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి బద్దెపూడి కుటుంబానికి పరామర్శ



పెదకాకాని: తంగెళ్లమూడి మాజీ సర్పంచి బద్దెపూడి రమేష్ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదివారం పరామర్శించారు. పెదకాకాని మండలంలోని తంగెళ్లమూడి మాజీ సర్పంచి బద్దెపూడి రమేష్ తండ్రి ఫ్రాన్సిస్(79) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అంబటి మురళీకృష్ణ, ఫ్రాన్సిస్ భౌతికకాయానికి సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోళ్ల జోసఫ్, పీఏసీఎస్ ఉప్పలపాడు మాజీ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్ పాల్గొన్నారు.

ఉప్పలపాడులో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం



పెదకాకాని: పర్యావరణ సమతుల్యతకు చిత్తడి నేలలు దోహదపడతాయని అటవీశాఖ రేంజర్ పోతురాజు అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ పోతురాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, జీవరాశుల పరిరక్షణకు చిత్తడి నేలలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు చిత్తడినేలల స్వభావం, వాటి ప్రయోజనాలను వివరించారు. తొలుత స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో లక్ష్మీకస్తూరి హాస్పిటల్ ఆధ్వర్యంలో రెడ్ల రామాలయంలో ఉచిత మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.శివారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. చిన్న అనారోగ్యంపాలైన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సను పొందాలన్నారు. అనంతరం గ్రామంలోని 150 మంది ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన చికిత్సలు అవసరమైన వారికి ఆస్పత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అఖిలసాయి, వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



మండల పరిధిలోని మంచాల గ్రామం నుంచి తోట్లపాలెం వెళ్లే రహదారి గోతులు పడి రాళ్లు లేచి ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు



తోట్లపాలెం గ్రామ పరిధిలో గోతుల మయంగా మారిన ప్రధాన రోడ్డు

గుంతల రోడ్లతో.. ప్రయాణం నరకం

- అడుగుకో గొయ్యి – గజానికో గుంత
- ప్రమాదభరితంగా తోట్లపాలెం రహదారి

తోట్లపాలెం(చేబ్రోలు): గుంతల రోడ్లతో నడక నరకప్రాయంగా మారింది. ద్విచక్ర వాహనాలు వెళ్లటానికి వీలుకాని విధంగా ఉంది. తారు మొత్తం కొట్టుకుపోయి, గోతులు ఏర్పడింది. అడుగుకో గుంత తయారైంది.

ఇదీ చేబ్రోలు మండలం తోట్లపాలేనికి వెళ్లే రోడ్డు దుస్థితి

పల్లె రోడ్లు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం మరమ్మతులు పేరుతో హడావుడి చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఎక్కడి రోడ్లు అక్కడే గుల్లబరిపోయాయి. చుండూరు వెళ్లే ప్రధాన రహదారి నుంచి తోట్లపాలెం వెళ్లే రహదారి ఎంట్రన్స్ సమీపంలో సుమారు నాలుగు అడుగుల లోతులో పెద్ద ఉంది. మూల మలుపుల వద్ద అధ్వానంగా ఉన్న రహదారితో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- చేబ్రోలు మండలం తోట్లపాలెం గ్రామానికి వెళ్లటానికి మంచాల గ్రామ అడ్డరోడ్డు నుంచి చుండూరు వెళ్లే ప్రధాన రహదారి నుంచి సుమారు 3 కిలోమీటర్ల తారు రోడ్డును నిర్మించారు. సుమారు పది సంవత్సరాల క్రితం ప్రధానమంత్రి సడక్ యోజన కింద నిర్మించిన తారు రోడ్డుకు అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవటంతో ప్రస్తుతం రాకపోకలు సాగించటానికి కూడా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

-మండల పరిధిలోని మంచాల అడ్డరోడ్డు నుంచి తోట్లపాలెం వెళ్లటానికి ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారి నుంచి తోట్లపాలెం గ్రామంతో పాటు వేటపాలెం, శ్రీరంపురం వెళ్లటానికి ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.



తోట్లపాలెం గ్రామ సమీపంలో గుంతల్లో నీరు చేరి అధ్వానంగా రోడ్డు



చేబ్రోలు మండలం మంచాల- తోట్లపాలెం రహదారికి సమీపంలో పెద్ద గుంత

నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులు

తోట్లపాలెం గ్రామ పంచాయతీకి గతంలో పొన్నూరు, గుంటూరు డిపోల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిచేవి. రహదారి పూర్తిగా ఛిద్రమవటంతో ఈ సర్వీసులు రద్దు అయ్యాయి. ప్రస్తుతం ఆటోలు కూడా రాకపోకలు సాగించటానికి ముందుకు రావటం లేదు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలోకి రాకపోకలు సాగించేవారు సర్కస్ ఫీట్లు తో ప్రమాదభరితం ప్రయాణిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ మార్గం ద్వారా పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలో ఉన్న మండల ప్రభుత్వ పాఠశాల ఉండటంతో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, గర్భిణీలు, వృద్ధులు, రోగులు వైద్య సేవల నిమిత్తం గుంటూరు, పొన్నూరు వెళ్లటానికి అనేక అవస్థలు పడుతున్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: నడింపాలెంలో పంచాయతీ అధికారులు మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఉత్తమ పంచాయతీలో నెలల తరబడి మురుగు కాలువల్లో సిల్ట్ తియ్యకపోవడంతో మురుగు ముందుకు పారక, దోమలకు ఆవాస ప్రాంతాలుగా మారాయంటూ గత నెల 31వ తేదీన 'సాక్షి' లో 'ఉత్తమ పంచాయతీలో సమస్యల తిష్ట' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామ ఇన్‌చార్జి సర్పంచి పాలెపు కుమారి యుద్ధ ప్రాతిపదికన మురుగు కాలువల్లో సిల్ట్ తీయించారు. ప్రొక్లెయిన్ సాయంతో గ్రామంలోని మెయిన్ రోడ్డు పొడవునా రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగుకాలువలో సిల్ట్ తీయించడంతో పాటు కాలువలో ఏపుగా పెరిగిన పెద్ద పెద్ద పిచ్చి చెట్లను పీకివేయించారు. దీంతో మురుగు సాఫీగా ముందుకు సాగుతుంది. పనులను ఈఓపీఆర్డీ రవి కుమార్, సెక్రటరీ శర్మతో కలసి పరిశీలించారు.



పూడిక తీసిన అనంతరం మురుగు కాలువలు

వైభవంగా వసంత పంచమి

గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవి అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని విద్యార్థులను ఆశీర్వదీస్తూ సరస్వతీదేవి అనుగ్రహంతో పాటు మీరు కూడా నిరంతరం శ్రమించినపుడే మంచి ఫలితాలు సాధ్యమని తెలిపారు. జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి రామచంద్రరావు మాట్లాడుతూ జూనియర్ కాలేజీ విద్యార్థులు గతఏడాదికన్నా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వేదపండితులు కష్ణమాచార్యులు విద్యార్థులతో పూజలు చేయించి మంచి ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో విగ్రహ దాత ఈదా వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి వీర గంగాధరరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు జ్ఞానయ్య, వలిరాజు, శాంతిప్రియ, లలితకుమారి, శివపార్వతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



వసంత పంచమి ప్రత్యేక పూజల్లో పాఠశాల ఉపాధ్యాయులు

లక్షల డప్పులు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

చేబ్రోలు: లక్షల డప్పులు.. వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కూచిపూడి రవిశేఖర్, కూచిపూడి సత్యం పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ సమాయత్త నియోజకవర్గ కార్యక్రమాన్ని ఆదివారం చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించారు. దీనిలో భాగంగా 25 డప్పులను టీడీపీ నాయకుడు కూచిపూడి రవిశేఖర్ బహూకరించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనలో మండలంలోని మాదిగలు భారీగా పాల్గొనాలని నాయకులు కోరారు. కూచిపూడి రవి శేఖర్, కూచిపూడి సత్యం మాదిగ తదితర నాయకులు చలో హైదరాబాద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేబ్రోలులోని ఐదు మాదిగ పల్లెల నుంచి ఎమ్మార్పీఎస్ యువత డప్పుల ప్రదర్శన నిర్వహించారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రోడ్లపైనే పార్కింగ్.. పట్టించుకోరా..!

- రోడ్లపైనే వాహనాలు నిలవడం ద్వారా ట్రాఫిక్ అంతరాయం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు

పెదకాకాని: రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. పెరిగిన వాహనాలతో గుంటూరు నుంచి పెదకాకాని వెళ్లే రోడ్డు ఉదయం నుంచి రాత్రి వరకూ రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులో గుంటూరు బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ నుంచి పెదకాకాని పరిధిలో ఉన్న ఆటోనగర్ వరకూ రోడ్డు మార్జిన్‌లలో చిరువ్యాపారులు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. వారి వద్ద కొనుగోలు చేసేందుకు బైక్‌లు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు వ్యాపారుల్లో నెలకొన్న పోటీ కారణంగా వ్యాపారం చేసే సరుకు ఉన్న బండ్లు, ఆటోలు రోడ్డుపై పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అలానే రెస్టారెంట్‌ల ఎదుట, కారు షోరూం వద్ద, ఆటో షోరూంల వద్ద, ఆన్‌లైన్ గుర్రాల పందేలు నిర్వహించే ప్రదేశంలోనూ బైక్‌లు, కార్లు రోడ్డుపై పెట్టి తాళాలు వేసి వెళ్లి పోతున్నారు. రెప్పపాటులో ఒక వాహనాన్ని మరొక వాహనం దాటే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డుపైనా మార్జిన్‌లలో పెట్టే వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు వ్యాపారులు మార్జిన్‌తో పాటు మురుగు కాలువలు, రోడ్డును కూడా స్వాధీనం చేసుకుని సొంత అవసరాలకు వాడుకుంటున్నారు.



గుర్రాల పందేలు ఆన్‌లైన్ బెట్టింగ్ కేంద్రం వద్ద రోడ్డుపైనే ద్విచక్రవాహనాల పార్కింగ్



మహేంద్రషోరూం ఎదురుగా రోడ్డుపైనే నిలిపిన కార్లు

ఆర్టీసీ బస్సు.. ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ కొన్న ఘటనలో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. వివరాలు.. ఆదివారం నారాకోడూరు గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపటంతో నిజాంపట్నం నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. ఆటో డ్రైవర్ అభిషేక్‌కు కొద్దిపాటి గాయాలైనాయి. బాధితుడు గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





చేబ్రోలు: మండలం నారాకోడూరు గ్రామ శివారులో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని వేజండ్ల గ్రామానికి చెందిన షేక్ సత్తార్, శ్రీనులు గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి సమయంలో స్వగ్రామానికి బయలు దేరారు. మార్గమధ్యలో నారాకోడూరులోని ఆల్ఫా హోటల్ సమీపంలో గుంటూరు నుంచి వస్తున్న కారు ప్రమాదవశాత్తూ ఢీ కొట్టింది. ఈ ఘటనలో సత్తార్, శ్రీనులకు తీవ్ర గాయలయ్యాయి. ముఖానికి, కాళ్లు, చేతులకు గాయాలైన బాధితులను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ యాక్టివిటీ కార్యదర్శిగా సతీష్‌రెడ్డి



పెదకాకాని: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురిని గుంటూరు జిల్లా కమిటీలో పలు హోదాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నియామకాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా ఉయ్యూరు సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి ఉయ్యూరు సతీష్‌రెడ్డి గతంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. అలానే ఆయన తల్లి వుయ్యూరు సీతమ్మ నంబూరు గ్రామం సర్పంచిగా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడించారు. ప్రస్తుతం నంబూరు పంచాయతీ ఉప సర్పంచిగా వుయ్యూరు సతీష్‌రెడ్డి భార్య భవానీ పనిచేస్తున్నారు. గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ యాక్టివిటీ కార్యదర్శిగా నియమితులైన వుయ్యూరు సతీష్‌రెడ్డిని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

స్కానింగ్‌తో గర్భస్థ శిశువు లోపాలు గుర్తించవచ్చు

గైనకాలజిస్టుల సంఘం నేతలు వెల్లడి

గుంటూరు మెడికల్: అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా గర్భంలో ఉన్న శిశువుకు లోపాలు ఉంటే ముందస్తుగానే గుర్తించి నివారించే ప్రయత్నం చేయవచ్చని డాక్టర్ శ్వేత అన్నారు. గైనకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరులోని శ్వేత ఫీటల్ మెడిసిన్ సెంటర్‌లో అల్ట్రా సౌండ్ ఏ విధంగా చేయాలనే విషయాలపై నిరంతర వైద్య విద్య(సీఎంఈ) కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గర్భిణులకు ఏ విధంగా స్కానింగ్ పరీక్షలు చేయాలి, పిండంలోని లోపాలను ఏ విధంగా గుర్తించాలి అనే విషయాలను డాక్టర్ శ్వేత వివరించారు. గైనకాలజీ వైద్యుల సంఘం సెక్రటరీ, సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయటం వల్ల అనేక లాభాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా గర్భంలో ఉండే శిశువు ఆరోగ్య పరిస్థితి గురించి గైనకాలజిస్టులు, శిశువుల తల్లులు స్కానింగ్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వివరించారు. క్రమం తప్పకుండా గర్భం దాల్చిన నాటి నుంచి నెలా నెలా స్కానింగ్ చేయించటం ద్వారా బిడ్డ ఆరోగ్యంపై పూర్తి అవగాహన ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కానింగ్ చేసేవారు కాని, చేయించుకునేవారు గాని కడుపులో ఉండే శిశువు ఆడ లేక మగ అనే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ నేరమని, దీనికి తీవ్రమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీ వాణి, డాక్టర్ శనక్కాయల రాజకుమారి, డాక్టర్ ఇందిరా, డాక్టర్ షమా సుల్తానా, గుంటూరు మెడికల్ కాలేజ్, కాటూరి మెడికల్ కాలేజ్ పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన గైనకాలజిస్టుల సంఘం నేతలు, గైనకాలజిస్టులు

కౌలు రైతులకు కౌలు చట్టం తీసుకు రావాలి

- ఈనెల 12న మండల కార్యాలయాల వద్ద ధర్నా
- కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

లక్ష్మీపురం: ఎన్నికల హామీలో భాగంగా కౌలు రైతుల రక్షణ, వారి సంక్షేమానికి నూతనంగా సమగ్రమైన కౌలు చట్టం తీసుకురావాలని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం హామీలేని పంట రుణాలు కౌలు రైతులకు ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం సంఘం అధ్యక్షులు ఎ.కాటమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల డిమాండ్ల పరిష్కారానికి ఫిబ్రవరి 12 మండల ఆఫీసుల వద్ద ధర్నాలు, మార్చి 3 తేదీన జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద ధర్నాలు చేయాలని సంఘం తరుపున తీర్మానించడం జరిగిందన్నారు. భూయజమానితో సంబంధం లేకుండానే గ్రామ సభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. కౌలు రైతులు పండిస్తున్న పంటలకు ఉచిత బీమా పథకాన్ని వర్తింప చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ జేశారు. కేంద్ర బడ్జెట్ లో ప్రకటించిన ప్రకారం కిసాన్ క్రెడిట్ కార్డులు కౌలురైతులకు జారీ చేయాలని వీటి ఆధారంగా హమీ లేని పంట రుణాలు ఇచ్చి ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల కబంధహస్తాల నుంచి రక్షణ కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మార్చి 20వ తేదీన రబీలోనైనా కౌలురైతులకు పంటరుణాలు అందించాలని కోరుతూ జిల్లా కేంద్రాల్లో ఉన్న లీడ్ బ్యాంకు మేనేజర్ ఆఫీసుల వద్ద ఆందోళన నిర్వహించాలని మరో తీర్మానం చేసిందని చెప్పారు. దేవాలయ భూములను సాగు చేస్తున్న కౌలురైతులకు శాశ్వత కౌలు హక్కు పత్రాలు ఇవ్వాలని తీర్మానం చేసిందని చెప్పారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కంజులవిట్టల్ రెడ్డి, పి.వి.జగన్నాథం మరియు పల్నాడు కౌలురైతుల సంఘం నాయకులు పి.లక్షాధికారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

స్టాండింగ్ కమిటీ ఎన్నిక పకడ్బందీగా నిర్వహించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు సోమవారం పకడ్బందీగా నిర్వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఉదయం కమిషనర్, ఎన్నికల అధికారి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఇతర అధికారులతో కలసి ఆదివారం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత ఎన్నికల నిర్వహణకు సంబంధించి సూచిక బోర్డులు, పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కంపార్ట్ మెంట్, బ్యాలెట్ బాక్స్, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పోలింగ్ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యి మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందని వివరించారు. ఓటు వేయుటకు వచ్చే కార్పొరేటర్లుకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని, లోపలకు వచ్చు సమయంలో నగర పాలక సంస్థ జారీ చేసిన ఐడెంటి కార్డులు విధిగా కలిగి ఉండాలని, ఫోన్లు, ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువులు, ఏ ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడదన్నారు. కార్పొరేటర్ల ఇతర వస్తువులు భద్రపరచుకునేందుకు నగర పాలక సంస్థ పార్కింగ్ ప్రాంతంలో పౌరసేవా కేంద్రం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్లోక్ రూమ్‌లో భద్రపరచుకోవాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా నగర పాలక సంస్థ కార్యాలయంలోకి ఇతర వాహనాలు పార్కింగ్ నిషేధించడమైనదని వెల్లడించారు. ఓటింగ్ కోసం కార్యాలయానికి వచ్చే కార్పొరేటర్ల వాహనాలను గాంధి పార్క్ పార్కింగ్‌లో పార్కింగ్‌కు అవకాశం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి, డెప్యూటీ కమిషనర్ 1 డి.శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు, ఓటర్ల గుర్తింపు అధికారి, నగర పాలక సంస్థ మేనేజర్ షేక్ బాలాజీ బాషా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పద్మనాభరావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార మాంస విక్రయాలు జరిపితే చర్యలు

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని రోడ్లపై నాటు కోళ్లు, చేపలు అనధికార విక్రయాలపై ప్రజారోగ్యం దృష్ట్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్ఓ రవి బాబు పేర్కొన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు ఆదివారం బృందాలుగా ఏర్పడి నగరంలో తనిఖీలు నిర్వహించారు. మిర్చియార్డు, ఆర్టీఓ ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పట్టాభిపురం ప్రాంతాలలో రోడ్లపై అనధికారికంగా చేపలు, నాటుకోళ్ళు, మేకలను వధించి విక్రయిస్తున్న వారిని గుర్తించి వారి పై దాడులు నిర్వహించి వాటిని తొలగించి, అపరాధ రుసుం క్రింద 12,500 రూపాయలు వసూలు చేశారు. కార్యక్రమంలో వెటర్నరి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ ఎస్ ఆనందకుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్లు సి.హెచ్ శ్రీనివాస్, నాగేశ్వర రావు, రాము, దాస్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ప్రజారోగ్య సిబ్బంది

వెంకట సుబ్బయ్యకు సన్మానం

పొన్నూరు: యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్యను ఘనంగా సత్కరించారు. పార్టీ అధికార ప్రతినిధిగా సుబ్బయ్య నియామకాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో సంఘం జిల్లా నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొమరగిరి సూరిబాబు, చౌటూరి రమేష్, బాపట్ల నాగప్రసాద్, పొట్లూరి అశోక్, బంగారాజు, ఏడుకొండలు, రావూరి గోపి, మరియమ్మ, తలపల తిరుపతయ్య, రాము, కందుకూరి అశోక్, ఈగా సీతారామయ్య పాల్గొన్నారు.



సుబ్బయ్యను సత్కరించిన యానాదుల సంక్షేమ సంఘం నాయకులు